క్లుప్తంగా

విద్యార్థులు సంచలనాలు సృష్టించాలి



అచ్చంపేట రూరల్: చదువులో విద్యార్థులు సంచలనాలు సృష్టించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో ఉన్నత స్థాయికి చేరడానికి చదువే ప్రధాన మూలమన్నారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, చందునాయక్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన పోలీసులు



కల్వకుర్తి: సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోహర్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం కల్వకుర్తి డీఎస్పీ గిరిబాబు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి సీఐ ఆంజనేయులు, వెల్దండ సీఐ రామకృష్ణ, కల్వకుర్తి ఎస్ఐ రమేష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎస్ఐకి సన్మానం

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజుయాదవ్‌ను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఎస్ఐతో పాటు రైతులు, పేద మహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. వాసవీక్లబ్ రీజినల్ చైర్మన్ శ్రీనివాసులు, ఓరుగంటి శ్రీనివాస్, పోలెచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

వంగూరు: మండలంలోని ఉమ్మాపూర్‌కి చెందిన మాజీ సర్పంచ్ నిరంజన్ భార్య ఈశ్వరమ్మ అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. బాధిత కుటుంబానికి యువజన కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లయ్య రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాలయ్య, మల్లయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

చారకొండ: మండలంలోని అగ్రహారం తండాలో ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందిన మహిళ కుటుంబాన్ని శనివారం సిర్సనగండ్ల ఎంపీటీసీ లక్ష్మణ్ నాయక్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. రాంలాల్ నాయక్, దేవు, శంకర్ నాయక్, దశరథ్ తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.45 వేల విరాళం

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి రూ.25 వేలు, జిల్లా నాయకులు సంజీవ్‌కుమార్ యాదవ్ రూ.20 వేలను విరాళంగా సర్పంచ్ అంజినాయక్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేవాలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించాలన్నారు. పనులు నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

కళాకారుల భిక్షాటన



కొల్లాపూర్: పట్టణంలోని తెలంగాణ జానపద కళాకారుల సంఘం నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగో రోజు కొనసాగాయి. శనివారం పట్టణంలో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ జానపద కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాముమాదిగ మాట్లాడారు. కళాకారుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎస్సీ కళాకారులకు దళితబంధు ప్రకటించాలని, బీసీ కళాకారులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని, కళాకారులకు కళాభవన్ నిర్మించాలని కోరారు. మంతటి గోపి, రాజగోపాల్, నాగరాజు, నర్సింహ, రామకృష్ణ, జ్యోతి, నర్సింహ, మధు, శ్రావణి, స్వాతి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు అండగా ఉండాలి

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు అండగా ఉండి ప్రోత్సహించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం వెల్దండలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు యూత్‌ఫర్ సేవా కల్వకుర్తి వారు స్కూల్ బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎంఈఓ శంకర్‌నాయక్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు స్వచ్ఛంద సంస్థల వారు అండగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, నోట్‌పుస్తకాలు అందజేశారు. జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంగీత, శ్రీనాథ్, గీత, గౌతమ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



అచ్చంపేటలో డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులకు సన్మానం



కల్వకుర్తిలో వైద్యులను సన్మానిస్తున్న రాఘవేందర్ తదితరులు

కల్వకుర్తి రూరల్: ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు రాఘవేందర్ మాట్లాడారు. ప్రజల ప్రాణాలు నిలుపుతున్న ప్రాణదాతలు వైద్యులు అని కొనియాడారు. సూపరింటెండెంట్ శివరాం, డాక్టర్ శ్రీనివాస్, శ్రీధర్, కిషన్, యశోద బాయి తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులను శనివారం డాక్టర్స్‌డే సందర్భంగా పలు సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రజల ఆరోగ్యాలను కాపాడే వైద్యులే నిజమైన దేవుళ్లన్నారు. లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ పోలిశెట్టి నరేష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ బీదన్ చంద్రరాయ్ జయంతి సందర్భంగా నిర్వహించే వేడుకలను పురస్కరించుకుని ఆస్పత్రిలో వైద్యులు కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆస్పత్రి చైర్మన్ కాటం జంబులయ్య, వైద్యులు యాదగిరి బిల్లా, జయచంద్ర ప్రసాద్ యాదవ్, శ్యామ్‌ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

అమ్రాబాద్: డాక్టర్స్ డేను పురస్కరించుకుని శనివారం వాసవీ క్లబ్ నల్లమల కింగ్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని వైద్యాధికారి రమాకాంత్‌ను ఘనంగా సన్మానించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు శ్యాంసుందర్, శ్రీనివాస్, కృష్ణకిషోర్, రమేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన



విద్యుత్ ఏఈ కృష్ణగోపాల్‌కు వినతి అందజేస్తున్న చందాయిపల్లి వాసులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో గగ్గలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అనుబంధ గ్రామమైన చందాయిపల్లిలో నివాసం ఉంటున్న గుడిసెలకు తక్షణం విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ.. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడారు. 1997లో అప్పటి ప్రభుత్వం ఇళ్లస్థలాలకు పట్టాలివ్వగా, గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారన్నారు. దాదాపు 44 మంది అక్కడే జీవనం కొనసాగిస్తున్నప్పటికీ తాగునీటి సౌకర్యం, రోడ్డు, విద్యుత్ సౌకర్యాలు లేక నివాస ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపించారు. తక్షణం విద్యుత్ ఏఈ స్పందించి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న లబ్ధిదారులకు కరెంటు సౌకర్యం కల్పించి, మీటర్లకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ ఏఈ కృష్ణగోపాల్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు చింత శివకుమార్, విష్ణుమూర్తి, వెంకటస్వామి, నిరంజన్, భారతి, కృష్ణవేణి, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మండలం ఏర్పాటుకు ఉద్యమం



కల్వకుర్తి రూరల్: మండలంలోని రఘుపతిపేటను మండల కేంద్రంగా చేయాలనే డిమాండ్‌తో ఉద్యమిస్తామని బాలీశ్వర్ చెప్పారు. శనివారం పలువురు వాసులతో మాట్లాడారు. గతంలో సీఎం ఎన్టీరామారావు ఉన్నప్పుడే రఘుపతిపేటను మండల కేంద్రంగా చేయాలని నిర్ణయించారని గుర్తు చేశారు. మరోసారి రఘుపతిపేట మండల సాధన కోసం ఉద్యమిస్తామని బాలీశ్వర్ హెచ్చరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

తెలకపల్లి: మండల కేంద్రంలోని శ్రీనివాసా కాలనీలో శనివారం సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. శ్రీనివాసా కాలనీలోని ఎంపీటీసీ విజయలక్ష్మి సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. కాలనీలో సీసీరోడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు అన్నారు. సీసీరోడ్డు ఏర్పాటుతో ఇబ్బందులు తీరనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాధవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంగూరు: మండలం పోల్కంపల్లిలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం సర్పంచ్ చెన్నయ్య, ఎంపీటీసీ సభ్యురాలు గీతవిజయ్‌పాల్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేయడంతో గ్రామంలో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నోట్‌పుస్తకాల పంపిణీ

వెల్దండ: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. శనివారం వెల్దండ మండల పరిధిలోని కొట్ర ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దుస్తులు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌రావు, హెచ్ఎం కృష్ణారెడ్డి, రామారావు తదితరులు ఉన్నారు.



కొట్రలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాలాజీసింగ్

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు వెల్దండ పాఠశాలలోని వంద మంది విద్యార్థులకు రూ.లక్ష విలువ చేసే స్కూల్ కిట్లను శనివారం యూత్‌ఫర్ సేవా కార్యకర్తలు అందజేశారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పునుంతల జెడ్పీహెచ్ఎస్, తాడూరు యూపీఎస్, వెల్టూరు గురుకుల పాఠశాల విద్యార్థులకు శనివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి స్వప్న సికిల్ సెల్ ఎనీమియా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన 310 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశామని వైద్యాధికారిణి తెలియజేశారు. వైద్యాధికారులు స్వప్న, బిక్కులాల్, ఫార్మసిస్టు శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ప్రభావతి, శంకరమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండల పరిధిలోని కొత్తకుంటపల్లి, అప్పాయపల్లి, చెన్నంపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం లింగాల, అంబట్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.



వెల్టూరు బాలికల గురుకుల పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు, సిబ్బంది

దోమలపెంట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వైద్యులు డా.అభిలాష్ రక్తహీనత నిర్వహించారు.

ఆన్‌లైన్ మోసం రూ.14,862 నష్టం

అమ్రాబాద్: ఆన్‌లైన్ మోసానికి ఓ యువకుడు రూ.14,862 నగదును పోగొట్టుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన నోముల రాజెందర్‌గౌడ్ తన తమ్ముడు రమేష్‌గౌడ్ సమాచారంతో ఇండియన్ బుల్ బ్యాంక్ పేరు మీద ఫేస్‌బుక్‌లో వచ్చిన మెసేజ్ చూసి తనకు రుణం కావాలని మెసేజ్ చేశాడు. వారి నుంచి రాజేందర్‌గౌడ్‌కు ఫోన్ కాల్ రావడంతో వారితో మాట్లాడి తనకు కొంత నగదు రుణం కావాలని అడిగాడు. ముందస్తుగా మా బ్యాంకులో ఖాతా తీయాలని ఇందు కోసం రూ.14,862 చెల్లించాలని చెప్పారు. దీంతో నిజమేనని నమ్మి జూన్ 27న రూ14,862 ఫోన్ పే చేశాడు. రెండు రోజులు చూసిన రాజేందర్‌గౌడ్ లోను ఇవ్వాలని ఫోన్ చేయడంతో మరో రూ.12,000 ఫోన్‌పే చేయమని తెలియజేశాడు. మోసపోయామని గ్రహించిన అతను అమ్రాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాజేందర్‌గౌడ్ ఫోన్‌పే చేసిన నెంబర్‌ను పరిశీలించగా.. బీహార్ రాష్ట్రానికి సంబంధించిందని తేలినట్లు ఎస్ఐ తెలియజేశారు. సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇంకా అత్యాశకు పోవద్దని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆకట్టుకున్న గోరింటాకు సంబరాలు



గోరింటాకుతో మహిళల సంబరాలు

తెలకపల్లి: మహిళలు గోరింటాకుతో సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో శనివారం శ్రీముఖ దుర్గాదేవి ఆలయం వద్ద నిర్వహించిన మహిళా భక్తుల ఆధ్వర్యంలో ఆషాఢమాసం గోరింటాకు మహోత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి ఆషాఢమాసం ప్రత్యేకం కావడంతో ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేశారు. అనంతరం మహిళలందరూ చేతులకు గోరింటాకు పెట్టుకొని ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మారోజు ఉమాపతాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సరస్వతి, శ్రీదేవి, గౌరమ్మ, పుష్పమ్మ, జయంతి, గీత తదితర మహిళలు పాల్గొన్నారు.

నల్లబెల్లం అమ్మితే చర్యలు



పట్టుబడిన వ్యక్తిని చూయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

అచ్చంపేట రూరల్: నిషేధిత నల్లబెల్లం అమ్మినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ బాలరాజు హెచ్చరించారు. శనివారం అచ్చంపేటలోని పలు కిరాణ దుకాణాలను పరిశీలించారు. గౌరీశంకర్ కిరాణ దుకాణంలో శివ్వ కోటయ్య అను వ్యక్తి నుంచి 15 సంచుల నల్లబెల్లం 450 కిలోలు, 40 కిలోల స్పటికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. శివకోటయ్య సొంత గ్రామమైన గుంపన్‌పల్లిలో సారా తయారీకి నల్లబెల్లం అమ్ముతున్నారని తెలిసిందన్నారు. కల్వకుర్తికి చెందిన శంభు సంతోష్, రమేష్ వ్యాపారస్తులు నల్లబెల్లం సరఫరా చేస్తున్నారని తెలిసిందని, వారు పరారీలో ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుల్ నవీన్ పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్ష కేంద్రాల పరిశీలన



తెలకపల్లిలో ఆర్‌జిరెడ్డి పరీక్ష కేంద్రం వద్ద పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు



వెల్దండలో పరీక్ష రాసి బయటికి వస్తున్న అభ్యర్థులు

తెలకపల్లి: గ్రూప్4 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలో నాలుగు కేంద్రాల్లో అభ్యర్థులు గ్రూప్ –4 పరీక్షలు రాశారు. ఉదయం మొత్తం 1,560 మందికి 1,337 మంది పరీక్షలకు హాజరయ్యారు. 223 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1,334 మంది హాజరయ్యారని ఆయా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. తహసీల్దార్ కృష్ణయ్య, వెంకటరమణ, ఎంపీడీఓ భాస్కర్, నర్సింహచారి తదితరులు పరిశీలించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో 408 మంది విద్యార్థులకు గాను 351 మంది పరీక్షకు హాజరయ్యారు. 57 మంది గైర్హాజరయ్యారని చీఫ్‌సూపరింటెండెంట్ మద్దిలేటి తెలియజేశారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 702 మంది అభ్యర్థులకు గాని 563 హాజరయ్యారు. పరీక్షలకు 139 మంది గైర్హాజరైనట్లు సీఎస్ పుష్పలత తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 144 సెక్షన్ విధించారు.

నూతన భవన నిర్మాణానికి ఏర్పాట్లు

తాడూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం నూతన భవన నిర్మాణానికి ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు సింగిల్ విండో చైర్మన్ ఎండీ సమ్మద్ పాష తెలిపారు. అందులో భాగంగా శనివారం భవనాన్ని కూల్చివేత కార్యక్రమం చేపట్టారు. అధునాతన హంగులతో రైతులు పాల్గొనే క్రమంలో అన్ని వసతులతో కూడిన నూతన భవనాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కూల్చివేత పనులు పరిశీలిస్తున్న చైర్మన్ తదితరులు

బీజేపీ బలోపేతానికి కృషి



మర్రిగుంతతండాలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

వంగూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ బలోపేతం చేయాలని ఆ పార్టీ కేంద్ర పరిశీలకులు విస్తారక్ హరీశ్ అన్నారు. శనివారం మేరాబూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాలని కార్యకర్తలను ఆదేశించారు. భాస్కర్, నవీన్‌రెడ్డి, శివ, వెంకటయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వెల్దండ: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు ఆచారి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కుప్పగండ్ల, మర్రిగుంతతండా, కేస్లీతండా గ్రామాల్లో గడప గడపకు బీజేపీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణలో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ శేఖర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాసచారి, రవికుమార్, జంగయ్యయాదవ్ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని విద్యానగర్‌లో శనివారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నా పథకాలను 107వ బూత్‌లో ప్రజలకు వివరించారు. గోపాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ రాఘవేందర్ గౌడ్, దుర్గాప్రసాద్, ప్రసన్నకుమార్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలని నిరసన

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని కుమ్మెరలో 1997లో అప్పటి ప్రభుత్వం ఆ గ్రామ శివారలోని 314 సర్వే నంబర్‌లో 192 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, కానీ స్థలాలు మాత్రం చూపించలేదని, వెంటనే పట్టాలు ఇచ్చిన వారికి స్థలాలు చూపించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. అశోక్ డిమాండ్ చేశారు. శనివారం ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కుమ్మెరలో సర్వే నిర్వహించారు. పేదలకు పట్టాలిచ్చి అదే భూమి నుంచి నీటి కాల్వలు తీయడం, అదే స్థలంలో ప్రభుత్వ పాఠశాల నిర్మించారన్నారు. ఆ భూమిపైన ఇంకా 7 ఎకరాల భూమి ఖాళీగా ఉందని పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, గ్రామస్తులు రాజు, రామస్వామి, వెంకటయ్య, వెంటకమ్మ, రాములు పాల్గొన్నారు.



కుమ్మెరలో సర్వే నిర్వహించిన అనంతరం మాట్లాడుతున్న సీఐటీయు నాయకులు

రైతులకు ఎరువుల అందజేత



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కందనూలు: ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ ఆదేశాల మేరకు శనివారం వాసవీ క్లబ్ నాగర్‌కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలోని శ్రీపురంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాయక స్వామి ఆలయంలో వాసవీ క్లబ్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైతులు, ఆర్మీ జవాన్లతో జైజవాన్, జై కిసాన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలువురు ఆర్మీ జవాన్లను శాలువాతో సన్మానించడంతో పాటు, పలువురు పేద రైతులకు ఎకరాకు సరిపడే ఎరువులు, విత్తనాలను పంపిణీ చేశారు. అదే విధంగా రంగనాయ స్వామి ఆలయ ఆవరణలో రెండు బెంచీలు అందజేడంతో పాటు పలువురు మహిళలకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు, హకీమ్ రాజేష్ మాట్లాడారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎప్పటికప్పుడు పేదలను ఆదుకునేందుకు వాసవీ క్లబ్ ముందుంటుందన్నారు. ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కల్కిచర్ల రమేష్, రీజియన్ చైర్మన్ అర్థం శ్రీనివాస్, రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్, మధుమోహన్, బాదం శివకుమార్, రమేష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎస్‌బీఐ



వెల్దండలో నోట్‌పుస్తకాలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ రాములునాయక్

వెల్దండ: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎస్‌బీఐ ముందుకు వస్తుందని వెల్దండ ఎస్‌బీఐ మేనేజర్ రాములునాయక్ పేర్కొన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రాములునాయక్ మాట్లాడుతూ ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యా సంస్థలకు వివిధ రూపాల్లో సహకారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాల: కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఎస్‌బీఐ మేనేజర్ మోహన్ విద్యార్థులను కోరారు. శనివారం ఎస్‌బీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు నోట్ బుక్స్ అందజేశారు.

కార్యకర్తల అండతోనే పార్టీ మనుగడ



తాడూరు: పార్టీ మనుగడ సాధించాలంటే చురుకైన కార్యకర్తలు అవసరమని పీసీసీ సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బాలగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని చర్లఇటిక్యాల, అల్లాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, సుశీల, లక్ష్మయ్య, సత్యం గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.